క్లుప్తంగా

నేడు ఆర్వీపల్లిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

గూడూరు: మండల పరిధిలోని కంకటావ గ్రామ సచివాలయం పరిధిలో రామనుజవత్తర్ల పల్లి(ఆర్వీపల్లి)లో ఆదివారం మధ్యాహ్నం నుంచి జరిగే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ పాల్గొంటారని మంత్రి కార్యాలయం శనివారం ఒక ప్రకటనలో పేర్కొంది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి జరిగే ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులంతా పాల్గొనాలని తెలిపింది. ఆర్వీపల్లి అనంతరం అంబేడ్కర్ కాలనీ, రమేష్‌నాయుడు కాలనీల్లో కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

దోమల నివారణ మందు పిచికారీ



మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి గ్రామ సచివాలయం-1 పరిధిలో దోమల నివారణ మందు శనివారం పిచికారీ చేశారు. గ్రామ సర్పంచ్ నందిగం మేరీరాణి ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శి త్రిపుర సుందరి నేతృత్వంలో పంచాయతీ సిబ్బందితో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో నీటి గుంటలు, డ్రెయిన్ల నుంచి వచ్చే దోమలు ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకుంటున్నామని కార్యదర్శి తెలిపారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు మొక్కల అందజేత



పెడన: శ్రీ బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లైబ్రరీ సైన్స్ అధ్యాపకుడు పేరిశెట్టి నాగరవి ప్రభుత్వ ఉద్యోగం విధుల్లో చేరి 30 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా కళాశాల ప్రాంగణంలో 30 మామిడి, జామ, నేరేడు మొక్కలను ప్రిన్సిపాల్ బీఎస్ఆర్వీ ప్రసాద్ చేతుల మీదుగా శనివారం అందజేయడంతో పాటు వాటిని కళాశాల ఆవరణలో నాటించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ.. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మొక్కలను అందజేసిన నాగరవికి ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర రామారావు, అధ్యాపకులు వరుదు నిరంజన్, సైదా, శ్రీనుబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

మచిలీపట్నంటౌన్: భారతదేశంలో పలువురు మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సామాజిక పరివర్తన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నగరంలో సామాజిక పరివర్తనలో సెప్టెంబర్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యుత్ శాఖ డీఈ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. నాయకుల త్యాగాలతో బహుజనులు స్వేచ్ఛా వాయువులు పీల్చే అవకాశం లభించిందన్నారు. పూణె ఒడంబడిక సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ చిలుకోటి కూర్మయ్య మాట్లాడుతూ పెరియార్ రామస్వామి నాయకర్ తమిళనాడులో చేపట్టిన ద్రవిడ ఉద్యమాన్ని వివరించారు. కాన్షీరాం, మహాత్మా జ్యోతిరావుపూలే, కవి కోకిల గుర్రం జాషువాల సేవలను వివరించారు. మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాన్ని మత్తే నాగరాజు, పంతగాని రమేష్, బట్టు శ్యామ్, చింతపల్లి మనోహర్ పర్యవేక్షించారు. సదస్సులో మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాలకు చెందిన పలువురు బహుజన నాయకులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 515 కేసుల పరిష్కారం



బంటుమిల్లి: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 515 కేసులు పరిష్కారమయ్యాయి. మండల న్యాయ సాధికార కమిటి పర్యవేక్షణలో చైర్మన్, న్యాయమూర్తి ఈ.సుధాకరరావు కోర్టు పరిధిలోని గ్రామాలకు చెందిన కేసులను రాజీ చేసి పరిష్కరించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ.. కక్షిదారులు కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్‌లు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో 480 పెట్టి కేసులు, 9 పీఎల్‌సీలు, 19 క్రిమినల్ కేసులు, 7 సివిల్ కేసులను కమిటీ చైర్మన్ పరిష్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైధాని ప్రసాద్, న్యాయవాదులు ఎస్.అశోక్‌కుమార్, ఈవీఎస్ రాయుడు, పవన్, మోజస్, బ్యాంక్ మేనేజర్లు, కక్షిదారులు పాల్గొన్నారు.

చట్టం ముందు అందరూ సమానమే

- స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబే
- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



అవనిగడ్డలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింహాద్రి, నేతలు

అవనిగడ్డ: చట్టం ముందు అందరూ సమానమేనని, తప్పు చేసిన వారు ఎంతటి వారైనా తప్పించుకోలేరని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబు కక్షసాధింపు చర్యని పేర్కొనడం అవివేకమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో ప్రధాన సూత్రధారి చంద్రబాబే అని స్పష్టం చేశారు. స్కిల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి రూ.3,350 కోట్లకు గాను రూ.370 కోట్లు అవినీతికి చంద్రబాబు పాల్పడ్డారని చెప్పారు. హవాలా కంపెనీల ద్వారా అటూ ఇటూ తిరిగొచ్చిన ఆ సొమ్ము చివరికీ చంద్రబాబుకు చేరిందన్నారు. ఆ డబ్బులకు తమకు సంబంధం లేదని గతంలో సీమెన్స్ కంపెనీ కోర్టుకు చెప్పిన విషయాన్ని గుర్తుకు చేశారు. జీవోకి అగ్రిమెంట్‌కు సంబంధం లేదని, ఒక్క రూపాయి పెట్టుబడి పెట్టకుండా కోట్లాది రూపాయలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. చట్టం తనపని తాను చేసుకు పోతుందని, తప్పు చేసి సానుభూతి పొందాలని చంద్రబాబు చూస్తున్నారని ఎద్దేవా చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన మూడు నెలలకే ఈ కుంభకోణం జరిగిందని, తాము అధికారంలో ఉన్నప్పుడే జీఎస్టీ అధికారుల విచారణలో వెలుగులోకి వచ్చిందన్నారు.

వెలుగులోకి మరిన్ని కుంభకోణాలు

వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయిన చంద్రబాబునాయుడు ముందు నుంచి ఆయన అడ్డదారులు తొక్కే అధికారంలోకి వచ్చారని గుర్తు చేశారు. ఆ నాడు ఎన్టీఆర్ నుంచి అధికారం లాక్కున్న ఆయన అధికారంలో ఉన్న కాలంలో అన్ని విషయాలపై సమగ్రంగా దర్యాప్తు చేస్తే ఇంకా ఎన్నో కుంభకోణాలు వెలుగులోకి వస్తాయని చెప్పారు. ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు షేక్ నజీర్‌బాబు, మాజీ సర్పంచ్ నలుకుర్తి పృథ్వీరాజ్, నాయకులు పాల్గొన్నారు.

తన రాజకీయ అనుభవం స్కామ్‌లు ఏ విధంగా చేయాలనే దానికి సరిపోతుందని, 14 ఏళ్లు సీఎంగా ఉండి ప్రజలకు ఏం చేయకుండా స్కామ్‌లలో మాత్రం నిష్ణాతులయ్యారని మాజీ సీఎం చంద్రబాబుపై పలువురు ప్రజాప్రతినిధులు, ప్రజలు ధ్వజమెత్తారు. బాబు అరెస్ట్‌పై స్పందిస్తూ చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని, తప్పు ఎవరూ చేసిన చట్టం ఉపేక్షించదన్నారు. ఎవరేమన్నారంటే..

పక్కా ఆధారాలతో అరెస్ట్..



స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ పేరుతో చంద్రబాబు చేసిన అవినీతిపై పక్కా ఆధారాలతో సీఐడీ అరెస్ట్ చేసింది. దీనిలో తన తప్పు లేకుంటే కోర్టులో నిరూపించుకోవాలి. అరెస్ట్‌ను ఖండించడం విచారకరం. దేశంలోనే అవినీతిపరుల్లో చంద్రబాబు ముందు వరుసలో ఉంటారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు.

– షేక్ సలార్‌దాదా, మున్సిపల్ మాజీ చైర్మన్, మచిలీపట్నం

ప్రతిపక్షాల తీరు హాస్యాస్పదం..



చంద్రబాబుకు ఐటీ నోటీసులు ఇచ్చినప్పుడు స్పందించని పవన్‌కళ్యాణ్, పురంధేశ్వరి సీఐడీ అరెస్ట్ చేస్తే మాత్రం స్పందించటం హాస్యాస్పదంగా ఉంది. అసెంబ్లీలో తీర్మానం చేయకుండా, కేబినెట్ ఆమోదం పొందకుండా స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారు. విచారణకు సహకరించాలి.

– బందెల థామస్‌నోబుల్, మచిలీపట్నం

చట్టానికి ఎవరు అతీతులుకారు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తనను అరెస్ట్ చేసిన తర్వాత అక్రమ కేసులు అనడం విడ్డూరం. ప్రజల్లో సానుభూతి కోసం ఆరాటపడుతున్నాడు. చట్టానికి ఎవరూ అతీతులుకారు. తాను చేసిన తప్పులను హుందాగా ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి. ఏ తప్పులు చేయకపోతే కోర్టుల్లో కేసులు వేసి విచారణను ఎందుకు అడ్డుకుంటాడు.

– వెలివెల చినబాబు, ఎంపీపీ, బంటుమిల్లి

హవాలా మార్గంలో స్వాహా..



చంద్రబాబు నాయుడు సీఎంగా ఉన్న సమయంలో ప్రభుత్వ సొమ్మును హవాలా మార్గంలో స్వాహా చేయడంతో సాక్ష్యాధారాలతో అరెస్ట్ చేశారు. తప్పు ఎవరూ చేసినా అరెస్ట్ కాకతప్పదు. తప్పు చేయకపోతే కోర్టే ఆ విషయాన్ని బయటపెడుతుంది. ప్రభుత్వ సొమ్మునే స్వాహా చేస్తే ఏ ప్రభుత్వం కూడా చూస్తూ ఊరుకోదు. ఆయనకు శిక్ష తప్పదు.

గరికిపాటి చారుమతి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, పెడన

చట్టం నుంచి తప్పించుకోలేరు



చంద్రబాబును అరెస్ట్ చేయగానే టీడీపీ నాయకులు గగ్గోలు పెడుతున్నారు. చంద్రబాబు ఏమైనా అరెస్టుకు అతీతుడా? గతంలో అనేక అవినీతి కేసుల్లో చంద్రబాబు స్టేలు తెచ్చుకుని తిరుగుతున్నారు. జగన్ ప్రభుత్వం దమ్ముగా ఆధారాలు సేకరించి అరెస్ట్ చేస్తే టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు అన్యాయంగా ఉంది. చట్టం నుంచి తప్పించుకోలేరు.

– మోపిదేవి ద్వారకానాథ్, చల్లపల్లి

పాపాల పుట్ట బద్దలవుతుంది..



చంద్రబాబు పాపాల పుట్ట బద్దలవుతోంది. టీడీపీ పాలనలో సాగిన అవినీతి, దోపిడీ మొత్తాన్ని విచారణ సంస్థలు ఒక్కొక్కటిగా బయటకు లాగుతున్నాయి. చంద్రబాబు చేసిన అనేక కుంభకోణాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ స్కామ్ ఒకటి. తనను అరెస్ట్ చేస్తారని చంద్రబాబు ముందు నుంచే ప్రచారం చేసుకున్నారు. సానుభూతి కోసం ఆరాటపడుతున్నారు.

– మహమ్మద్ షాహెదున్నీసా బేగం, లక్ష్మీపురం

బాబు హయాంలో అనేక కుంభకోణాలు



టీడీపీ ప్రభుత్వంలో చంద్రబాబు అధికారం అడ్డం పెట్టుకుని అనేక కుంభకోణాలు చేశారు. అమరావతి భూములు కుంభకోణం మొదలుకుని అనేక రకాలుగా అవినీతికి పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ మొదటి నుంచి చెబుతూనే ఉంది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా చంద్రబాబు చేసిన అవినీతిపై పూర్తి ఆధారాలతోనే చంద్రబాబును అరెస్ట్ చేశారు.

నూకల వెంకటేశ్వరరావు, లక్ష్మీపురం

హుందాగా వ్యవహరించాలి..



తప్పు చేసినవారు ఎంతటి వారైనా చట్టం తన పని తాను చేస్తుందని గతంలో చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు తన వరకు వచ్చేటప్పటికీ అన్యాయం, అక్రమం, విడ్డూరంలాంటి పదాలు గుర్తుకు వస్తున్నాయి. మాజీ ముఖ్యమంత్రిగా చట్టాన్ని గౌరవించి కార్యకర్తలను రెచ్చగొట్టి వారిని బలి చేయకుండా హుందాగా వ్యవహరించాలి.

– శ్రీనివాసరావు, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్.

చంద్రబాబు నిప్పు కాదు, తుప్పు



చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి ఎప్పుడూ విఘాతం కలిగిస్తూనే ఉన్నారు. ప్రతిసారి నేను నిప్పునంటూ చెప్పే చంద్రబాబు రాష్ట్రానికి పట్టిన తుప్పు అని ఈ అరెస్ట్‌తో తేలిపోయింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంస్థ ముసుగులో వందల కోట్ల అవినీతికి పాల్పడ్డారు. తానేమి తప్పు చేయలేదని చెబుతున్నారు. తప్పు చేయకుంటే విచారణను ఎదుర్కోవాలి.

చిటికిన నాగేశ్వరరావు, మచిలీపట్నం

మచిలీపట్నంలో టీడీపీ పిలుపునకు స్పందన కరువు

మచిలీపట్నంటౌన్: మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అరెస్ట్ నేపథ్యంలో ఆందోళన కార్యక్రమాలు చేయాలని టీడీపీ అధిష్టానం నుంచి వచ్చిన పిలుపునకు జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో స్పందన కరువైంది. నిరసన కార్యక్రమాలు చేసేందుకు ముఖ్య నాయకులు, ద్వితీయశ్రేణి నాయకులు కూడా కనపడని పరిస్థితి ఏర్పడటంతో 15 నుంచి 20 మంది కార్యకర్తలే టీడీపీ కార్యాలయం గేటు వద్ద కూర్చున్నారు. ముఖ్య నాయకులు బయటకు రాకుండా కార్యకర్తలతోనైనా ఏదొక కార్యక్రమం చేశామనిపించుకునేందుకు ప్రయత్నం చేసినా ఆశించిన మేర ఎవరు ముందుకు రాలేదు. దీంతో నగరంలో టీడీపీ నాయకులు రోడ్డెక్కి నిరసన కార్యక్రమాలు చేయలేదు.

నాయకులు ముఖం చాటేశారు..

రాష్ట్ర మాజీ మంత్రి కొల్లు రవీంద్ర విజయవాడకే పరిమితమయ్యారు. నగరంలోని టీడీపీ శ్రేణులతో పాటు ప్రజల్లో చంద్రబాబు అరెస్ట్‌పై స్పందన కరువైంది. చిన్నపాటి ధర్నా కార్యక్రమాలకు నాయకులతో పాటు కార్యకర్తలు వచ్చి నిరసన తెలపటం పరిపాటి. కానీ చంద్రబాబు అరెస్ట్‌పై ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ముఖం చాటేశారు. చంద్రబాబు అరెస్ట్‌ను ప్రజలు పట్టించుకున్నట్లుగా కనిపించలేదు. ప్రజల రోజువారీ కార్యక్రమాలు సజావుగా సాగాయి. మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణరావును, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎంవీ బాబాప్రసాద్‌ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. ఆ తరువాత కొనకళ్ల నారాయణరావును రూరల్ సీఐ కార్యాలయానికి తరలించారు. శనివారం ఉదయం 8.30 గంటల సమయంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు నాగపోతరావుసెంటరులోని టీడీపీ కార్యాలయం నుంచి నల్లబ్యాడ్జీలతో రోడ్డుపైకి వచ్చే ప్రయత్నం చేయగా పోలీసులు వారిని ముందస్తు చర్యలో భాగంగా అదుపులోకి తీసుకున్నారు. శనివారం రాత్రి టీడీపీ కార్యాలయం వద్ద సామాన్య కార్యకర్తలు 20 మంది కాగడాలతో నిరసన తెలిపారు.

వెంకన్నకు కోటి తులసీ పూజ



మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం కోటి తులసీ పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు ముత్తేవి శశికాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తేవి రవికాంత్, ఆలయ కార్యనిర్వహణాధికారి చక్రధరరావు పర్యవేక్షించారు.

మానవత్వం చాటుకున్న సీఐ మూర్తి



రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి ప్రథమ చికిత్స అందిస్తున్న సీఐ నవీన్ నరసింహమూర్తి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తికి తక్షణమే ప్రథమచికిత్స అందించటంతో పాటుగా హుటాహుటిన తన వాహనంలో ఎక్కించుకుని ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు హనుమాన్‌జంక్షన్ సీఐ అల్లు నవీన్ నరసింహమూర్తి. స్థానిక ప్రధాన కూడలిలో శనివారం బైక్‌పై వెళుతున్న వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. అదే సమయంలో అక్కడ ఉన్న సీఐ మూర్తి ఈ ప్రమాదాన్ని గుర్తించి వెంటనే స్పందించారు. గాయాల పాలైన ద్విచక్ర వాహనదారుడు ఉప్పలపాటి ప్రసాద్‌కు ప్రథమ చికిత్స అందించి, పోలీస్ వాహనంలోనే ఆస్పత్రికి తరలించారు. నూజివీడు రోడ్డు మలుపులో జరిగిన మరో ప్రమాదంలో లారీ అదుపు తప్పి సైకిల్‌పై పేపర్లు వేసే పేపర్ బాయ్ ప్రేమ్‌సాగర్‌ను ఢీకొట్టింది. దీంతో అతని కాలుకు తీవ్ర గాయం అయింది. హనుమాన్‌జంక్షన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

కొండలమ్మకు వెండి పళ్లెం సమర్పణ

గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారికి ఆలయ మాజీ చైర్మన్ పెన్నేరు ప్రభాకరరావు వెండి పళ్లాన్ని సమర్పించారు. శనివారం ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ కానూరి సురేష్‌కు 258 గ్రాముల వెండి పళ్లాన్ని అందించారు. దాత పేరుతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

రైతు కుటుంబానికి పీఏసీఎస్ సాయం



మాజేరు(చల్లపల్లి): రైతు కుటుంబానికి పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. కొత్తమాజేరులో ఇటీవల సొసైటీ సభ్య రైతు మట్టా పాండురంగారావు(75) మృతి చెందగా ఆయన కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సొసైటీ చైర్మన్ అరజా శివశంకర్ అందించారు. కార్యక్రమంలో సీఈవో ఎస్.ఎస్.చక్రపాణి, పర్సన్లు మోతుకూరి నాగమల్లేశ్వరరావు, పల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో ఆదివారం అమరావతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పరీక్షలు చేస్తారు. మణిపాల్ ఆస్పత్రి సౌజన్యంతో క్యాన్సర్, గుండె, జనరల్ వ్యాధులను పరీక్షలు చేసి అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తారన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



కళాకారులను సన్మానిస్తున్న పెద్దిరాజు తదితరులు

మచిలీపట్నంటౌన్: ఎన్నో సంవత్సరాలుగా పౌరాణిక నాటకాలు ప్రదర్శిస్తూ నేడు ఆదరణ కరువై ఇబ్బందులు పడుతున్న కళాకారులను ఆదరించి ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏపీఎస్ ఆర్టీసీ మచిలీపట్నం డిపో మేనేజర్ టి.పెద్దిరాజు అన్నారు. శ్రీరామకృష్ణ నాట్య మండలి 48వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం స్థానిక బచ్చుపేట మహతి ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామకృష్ణ నాట్య మండలి 48 సంవత్సరాలుగా నిర్విరామంగా కళాసేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు గుత్తికొండ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాట్యమండలి నిర్వాహకుడు జె.జగన్‌మోహనరావు, న్యాయవాదులు జొన్నవిత్తుల మల్లికార్జునప్రసాద్, ఎల్.బాలాజీ, వైద్యుడు పి.ధన్వంతరీ ఆచార్య, కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేముల సూరిబాబు, రంగస్థల నటి గంధం రాజేశ్వరి, నాట్యాచార్యులు పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దశాబ్దాల కాలంగా ప్రదర్శనలు ఇస్తున్న కొండేటి జనార్దన్, గోపీశర్మ, దాసరి వరలక్ష్మి, పువ్వుల శోభారాణిలను ఘనంగా సత్కరించారు. అనంతరం చింతా దూండికృష్ణ రాణాప్రతాప్‌సింగ్, వి.ఏడుకొండలు కాశీపతి ఏకపాత్రాభినయాలు ఆకట్టుకున్నాయి. కృష్ణుడిగా జగన్‌మోహనరావు, కర్ణుడిగా రాజేశ్వరరావు ప్రదర్శించిన కర్ణసందేశం ఘట్టం ఆకట్టుకుంది.

సబ్సిడీ దాణాను సద్వినియోగం చేసుకోండి



దాణాను అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగకుమారి తదితరులు

పెడన: పాడి పశువుల ఉన్నతికి, యజమానులు ఆర్థిక వృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, అందులో భాగంగానే పశువుల దాణాను 60 శాతం సబ్సిడీపై అందజేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. పెడన పశుసంవర్ధక శాఖ ఏడీ కార్యాలయానికి శనివారం పశువుల దాణా లోడు రావడంతో పాడి రైతులకు దాణాను అందజేశారు. ఈసందర్భంగా నాగకుమారి మాట్లాడుతూ.. పాడి పరిశ్రమను జగనన్న ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. పశుసంవర్ధక శాఖ ఏడీ కొనకళ్ల బాబూరావు మాట్లాడుతూ.. 25 టన్నుల పశువుల దాణా వచ్చిందన్నారు. పెడనకు 9, నందిగామకు 7, గూడూరు మండలానికి 10 టన్నుల దాణా వచ్చిందని చెప్పారు. ఈ దాణాకు పశువుల యాజమానులకు ఆర్బీకేల ద్వారా 60 శాతం సబ్సిడీపై ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రెహతున్నీసా, శివపావని, హుమయూన్, కటకం నాగకుమార్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

చవితి వేడుకలకు సిద్ధమవుతున్న గణనాథులు



మోపిదేవిలో విగ్రహాలను తయారు చేస్తున్న కళాకారులు

మోపిదేవి: వినాయక చవితి ఉత్సవాలకు గణనాథుని విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. మండల కేంద్రం మోపిదేవి తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని జాతీయ రహదారి పక్కన రాజస్తాన్ కళాకారులు గణపతి విగ్రహాలను తయారు చేస్తున్నారు. వివిధ ఆకారాల్లో గణేశుని విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. గత కొద్ది నెలలుగా 20 మంది వివిధ రూపాల్లో ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. మూడు అడుగుల నుంచి 12 అడుగుల పైబడిన గణపతి విగ్రహాలను ఈ ఏడాది ప్రత్యేకంగా తయారు చేసినట్లు నిర్వాహకుడు డోలారామ్ తెలిపారు. ఇప్పటికే కృష్ణా, గుంటూరు జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు విగ్రహాలు తరలించేందుకు ఆర్డర్లు ఇచ్చారన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో పెట్టాలి



ఎమ్మెల్యే సింహాద్రికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అవనిగడ్డ: ఎస్సీ వర్గీకరణ బిల్లు ఈ పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టేలా చూడాలని కోరుతూ స్థానిక ఎనిమిదవ వార్డులో అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాల ముందు శనివారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్‌కు విన్నవించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శాసనసభ్యుడు సింహాద్రి రమేష్‌బాబును కలిసి పార్లమెంట్‌లో వర్గీకరణ బిల్లు పెట్టేలా చూడాలని కోరారు. మండలి బుద్ధప్రసాద్ ఇంట్లో ఆయనను ఎమ్మార్పీఎస్ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కై తేపల్లి రాజేష్, కోటా దానియేల్, కొక్కిలిగడ్డ సువర్ణరాజు, కొక్కిలిగడ్డ నవీన్, తానంకి పోతురాజు, కొల్లూరి సురేష్, కై తేపల్లి రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి షటిల్ పోటీలు



మాట్లాడుతున్న గుత్తా నాని తదితరులు

గుడివాడటౌన్: ది గుడివాడ క్లబ్ (ఆఫీసర్స్ క్లబ్) ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు గుత్తా నాని తెలిపారు. శనివారం క్లబ్ కార్యవర్గంతో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయని, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పోటీలు ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు నగదు ప్రోత్సాహాలు అందజేస్తామని తెలిపారు. పోటీల ముగింపు అనంతరం 15 మంది క్లబ్ సభ్యులను సత్కరిస్తామని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి అడపా జగదీష్, సభ్యులు పళ్లపోతు రమేష్, కె.రవికుమార్, కె.రాంబాబు, జి.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



సీసీ రహదారి పనులను పరిశీలిస్తున్న నాయకులు

పామర్రు: స్థానిక సచివాయం-2 పరిధిలోని 9,10 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీ రహదారి పనులను ప్రారంభించారు. ఆయా వార్డుల్లో మొత్తం 5 సీసీ రహదార్లు సుమారు 530 మీటర్ల వరకు నిర్మిస్తున్నారు. ఈ పనులను స్థానిక ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలన్నారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదార్లను ప్రథమ ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేసి ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.